

కైకలూరు బిజెపి అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కైకలూరు నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ పేరు ఖరారైంది. బిజెపి ఎంఎల్‌ఎ అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధినాయకత్వం బుధవారం విడుదల చేసింది. 2014 ఎన్నికల్లో బిజెపి తరపున కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్ గెలిచారు. అనంతరం టిడిపి, బిజెపి ప్రభుత్వంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. అయితే కైకలూరు నుంచి బిజెపి నాయకుడు సోము వీర్రాజు పోటీ చేయనున్నట్లు తొలుత ప్రచారం సాగింది. అయితే ఎట్టకేలకు మళ్లీ కామినేని శ్రీనివాస్‌కే అవకాశం దక్కింది.

అమ్మో.. అంత ఖర్చా..!

- ఎన్నికల ఖర్చుపై అభ్యర్థుల్లో ఆందోళన
- రోజుకు ప్రచార ఖర్చు రూ.ఆరు లక్షలకుపైనేనంటూ గుబులు
- ఎన్నికలకు ఎక్కువ గడువు ఉండటంతో దిక్కుతోచని స్థితి
- ప్రచారానికే దాదాపు రూ.నాలుగు కోట్లు అంటూ లెక్కలు
- ప్రచార షెడ్యూల్‌లో అందుకే విరామాలు
- గత ఎన్నికల కంటే రూ.10 కోట్లు అదనపు ఖర్చంటూ ఆవేదన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఖర్చుపై అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పోలింగ్‌కు సమయం ఎక్కువగా ఉండటంతో ఎన్నికల ప్రచారానికే భారీగా ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఖర్చును ఎలా తగ్గించుకోవాలో తెలీక అభ్యర్థులంతా తలలు పట్టుకుంటున్నారు. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. నాలుగో విడతలో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానుంది. మే 13న పోలింగ్ జరగనుంది. గతంలో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు తొలి విడతలోనే జరిగేవి. మార్చి పదో తేదీకి అటుఇటుగా షెడ్యూల్ విడుదలవ్వగా ఏప్రిల్ 16వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ ముగిసేది. గత ఎన్నికలతో పోల్చుకుంటే దాదాపు నెల రోజులు ఎన్నికల ప్రక్రియ వెనక్కి వెళ్లింది. చాలామంది అభ్యర్థులు ఎన్నికల షెడ్యూల్ రాకుండానే ప్రచారం ప్రారంభించారు. షెడ్యూల్ వచ్చిన తర్వాత రెండు నెలల వ్యవధి రావడంతో భారీగా ఖర్చయ్యే పరిస్థితి ఏర్పడటంతో అంతా విలవిల్లాడుతున్నారు. జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు లోకసభ స్థానాలు ఉన్నాయి. అభ్యర్థులంతా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ మందీమార్బలంతో ఇంటింటికీ ప్రచారం సాగిస్తున్నారు. తక్కువగా లెక్కించినా ప్రచార ఖర్చు రోజుకు రూ.ఐదు నుంచి రూ.ఆరు లక్షలు వరకూ అవుతున్నట్లు అభ్యర్థులు లెక్కలు చెబుతున్నారు. భోజనాలు, మద్యం, డీజిల్ ఇతర ఖర్చులు భారీగా అవుతున్నట్లు చెబుతున్నారు. షెడ్యూల్ విడుదలైన తర్వాత పోలింగ్ సమయానికి దాదాపు రెండు నెలలు వ్యవధి రావడంతో ప్రచార ఖర్చు నిమిత్తమే దాదాపు రూ.నాలుగు కోట్లు కానున్నట్లు అభ్యర్థులు మదనపడుతున్నారు. గత ఎన్నికల కంటే ప్రచార ఖర్చు నిమిత్తమే రూ.రెండు కోట్లుపైనే అదనంగా వెచ్చించాల్సి వస్తుందని నలిగిపోతున్నారు. ఈ ఖర్చు కాకుండా ఎన్నికల ముందు నగదు పంపిణీ, తాయిలాలకు అయ్యే ఖర్చుపై లెక్కలు వేసుకుంటూ అభ్యర్థులు అదిరిపడుతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో లక్షన్నర నుంచి రెండు లక్షల వరకూ ఓటర్లున్నారు. ఓటుకు రూ.వెయ్యి పంపిణీ చేస్తే రూ.20 కోట్లు, రూ.రెండు వేలు పంపిణీ చేస్తే రూ.40 కోట్లు అవుతుందని, తక్కువగా లెక్కించినా ప్రధాన పార్టీలకు చెందిన ఎంఎల్‌ఎ అభ్యర్థులు రూ.50 కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని గుబులు చెందుతున్నారు. టిక్కెట్ రాకపోతే ఒక బాధ, వస్తే ఇంకోబాధ అంటూ అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఖర్చును తగ్గించుకునేందుకు పలువురు అభ్యర్థులు ప్రచార షెడ్యూల్‌లో విరామం ప్రకటిస్తున్న పరిస్థితి ఉంది. ఇతర పనుల పేరుతో ప్రచారానికి బ్రేక్ ఇస్తూ ఖర్చు తగ్గించుకునే ప్రణాళికతో ముందుకెళ్తున్నారని స్పష్టమవుతోంది. నగదు పంపిణీలోనూ సాధ్యమైనంత మేర ఖర్చు తగ్గించుకోవాలనే ఆలోచనలకు పదును పెడుతున్నట్లు తెలుస్తోంది.

అసంతృప్తులను బుజ్జగించేందుకు నజరానాలు..!

టిడిపి, జనసేన పొత్తుతో ఎన్నికల బరిలో నిలిచాయి. దీంతో అత్యధిక నియోజకవర్గాల్లో టిక్కెట్ ఆశించి భంగపడిన అభ్యర్థులతోపాటు ముఖ్యమైన నాయకులు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో టిక్కెట్ వచ్చిన అభ్యర్థులు ఆయా పార్టీల్లోని అభ్యర్థులను, కేడర్‌ను కలుపుకుని ముందుకెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. గతంలో టిక్కెట్ ఆశించిన అభ్యర్థికి, ఇతర నాయకులకు సైతం భారీగా నజరానా ముట్టజెబితే తప్ప వెనక్కి తగ్గడం లేదని సమాచారం. దీంతో టిడిపి, జనసేనలోని అభ్యర్థులకు ఈ ఖర్చు మరింత అదనపు భారంగా మారినట్లు చర్చ నడుస్తోంది. అధికార పార్టీ వైసిపి గెలుపు కోసం భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధమైందనే ప్రచారం నడుస్తోంది. అభ్యర్థులకు ముందుగానే దీనిపై దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఎన్నికల షెడ్యూల్ రాకముందే చాలామంది అధికార పార్టీ అభ్యర్థులు మహిళలకు, వాలంటీర్లకు, డ్వాక్రా సిఎలకు ఇలా పలువురు ఉద్యోగులకు బహుమతుల పేరుతో భారీగా ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. నగదు పంపిణీ సైతం పెద్దఎత్తున సాగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో అనుకున్నదానికంటే ఈసారి ఎన్నికల్లో భారీగా ఖర్చవుతుందని అన్ని పార్టీల అభ్యర్థులూ లబోదిబోమంటున్నారు.

ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్‌పై పట్టుపెంచాలి

ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాల తనిఖీలు ముమ్మరం చేయాలి : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలు మరింత అప్రమత్తంగా ఉండి జిల్లావ్యాప్తంగా నిఘాను మరింత పటిష్టపరచాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు తదితరులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎంసిసి అమలు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వివిఎస్‌టి బృందాల పనితీరు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేసే కార్యక్రమంలో భాగంగా స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-7లను, వివరాలను సరిదిద్దేందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-8లను చట్టబద్ధమైన విధానంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఎటువంటి అలసత్వానికి తావులేకుండా ఎవరికి నిర్దేశించిన విధులు వారు తుచ తప్పకుండా నిర్వర్తించాలన్నారు. సువిధ, ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గాలవారీ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ డి.పుష్పమణి పాల్గొన్నారు.

పెండింగ్ ఫారం-7, 8లను వెంటనే పరిష్కరించాలి
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

పెండింగ్‌లో ఉన్న ఫారం-7, 8లను వేగవంతంగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి జిల్లాలో సి విజిల్ అమలు తీరును వివరించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన 'నిజం గెలవాలి' యాత్ర

పలువురు కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

ప్రజాశక్తి - టి.నరసాపురం, ఉంగుటూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 'నిజం గెలవాలి' యాత్ర బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు భార్య భువనేశ్వరి మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనకు చరమ గీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. తొలుత టి.నర్సాపురం మండలంలోని మక్కినవారిగూడెంలో చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక మృతి చెందిన టిడిపి కార్యకర్త అబ్బదాసరి కృష్ణ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి భరోసాపత్రం అందజేశారు. తొలుత కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి చిర్రి బాల రాజు, నేతలు శీలం వెంకటేశ్వరరావు, నల్లూరి చలపతిరావు, గంటా మురళి, జయ్యవరపు శ్రీరామమూర్తి, తోట లక్ష్మీనారాయణ, ఆచంట సూర్యనారాయణ, మెతుకుమిల్లి గోపాలరావు, బొంతు సత్యనారాయణ, భీమవరపు జగన్మోహనరావు, అడపా నాగరాజు పాల్గొన్నారు. అనంతరం తాడేపల్లిగూడెం మండలంలో పర్యటించారు.



మృతుని కుటుంబంతో భువనేశ్వరి

ఉంగుటూరు: మండల కేంద్రమైన నిడమర్రుకు చెందిన గొర్రెల సుబ్బారావు కుటుంబాన్ని బుధవారం సాయంత్రం భువనేశ్వరి పరామర్శించారు. ఆమె వెంట జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం నారాయణపురం వద్ద పలువురు మహిళలతో మాట్లాడిన భువనేశ్వరి కృష్ణా జిల్లా వెళ్లిపోయారు.

కోకో.. ధర బాగు

- అంతర్జాతీయంగా పెరిగిన ధర
- రైతులు లాభపడేలా అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర పెరిగిన దృష్ట్యా ఆ ధర రైతులకు అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ బంగ్లాలో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన కోకో ధరలు వాటి ఫలితాలు రైతులకు అందుతున్నదీ లేనిదీ ఉద్యాన అధికారులు, రైతులు కోకో కొనుగోలుదారుల యాజమాన్యాలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గతేడాది ఇదే సమయంలో కిలో కోకో గింజలు రూ.200 నుంచి రూ.250 వరకు ఉండగా క్రమేపీ పెరుగుతూ ప్రస్తుతం రూ.700కు పైగా చేరిందని, ఇది రైతులకు ఆనందం కలిగించే విషయమని అన్నారు. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేనందున కోకో గింజల ధర పెరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కోకో పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 32,451 ఎకరాల్లో పంట సాగవుతుందని, 12 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని అందిస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ పోలవరం అభ్యర్థిగా రామ్మోహన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రానున్న ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గ అభ్యర్థిగా తమ పార్టీ నుంచి సరియం రామ్మోహన్ బరిలో ఉంటారని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు ధర్ముల సురేష్ తెలిపారు. మండలంలోని వాడపల్లి కాలనీలో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో వెట్టి సుబ్బన్న, పి.శ్రీనివాస్, కె.రాఘవ, కెవి.రమణ, బద్దా వెంకట్రావు, వి.భారతి, తగరం బాబూరావు, అంతర్వేదిగూడెం ఎంపిటిసి కొవ్వాసు గోవిందరాజు, పులి రామన్నగూడెం ఎంపిటిసి మడకం వెంకటలక్ష్మి, అలివేరు సర్పంచి కారం లక్ష్మి, కొరసవారిగూడెం సర్పంచి కొర్సా గంగరాజు, పులిరామన్నగూడెం సర్పంచి మడి శ్రీరాములు, ముంజులూరు సర్పంచి నడపల మక్కారెడ్డి, గడ్డపల్లి సర్పంచి చంద్రు శారద తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందుల్లేకుండా ప్రణాళిక

జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి

ప్రజాశక్తి - ఏలూరు

వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పటిష్ట కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు ఏర్పాటుపై డిఆర్ఒ డి.పుష్పమణి తదితర సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి వుంటుందన్నారు. అవసరమున్నచోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని, చెరువులు గోదావరి, కృష్ణా కాల్వల ద్వారా పూర్తిస్థాయిలో నింపాలని, పంటకాల్వలకు నీటి సరఫరా అంతరాయం లేకుండా గుర్రపుడెక్కలను తొలగించాలని తెలిపారు. కైకలూరు ఏరియాల్లో కృష్ణాకాల్వ ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, ఎన్ఆర్ జిఎస్ చెరువులు నింపాలని సూచించారు. పశువులకు తాగునీరు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, అప్ ల్యాండ్ ఏరియాలకు నీటితొట్టెలు, పంచాయతీ ట్యాప్ ద్వారా నీటిని నింపాలని అన్నారు. వేసవిలో ప్రజలకు ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా మందులను, వైద్య శాఖ ద్వారా ఒఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేయాలని, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను, అవగాహన సదస్సులను నిర్వహించాలని తెలిపారు. ఎన్ఆర్ జిఎస్ పనులకు సంబంధించి ఇప్పటికే తాగునీరు, మందుల కిట్స్‌ను ఏర్పాటు చేశారని, ఎఎన్ఎంల ద్వారా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఎన్ఆర్ జిఎస్ వారికి శిక్షణ ఇప్పించాలని అన్నారు. ఎన్ఆర్ జిఎస్ పనులు ఉదయం నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు చేయించాలని తెలిపారు. జిల్లా పరిషత్ ద్వారా ప్రతి మండల కేంద్రాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో, 15వ ఆర్థిక సంఘం నిధులు ఉపయోగించుకొని చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు యాజమాన్యం తాగునీరును అందుబాటులో ఉంచేలా యాజమాన్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక దళం అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో తాగునీరు ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు తాగునీటిని అందించే చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డ్వామా పీడీ ఎ.రాము, ఆర్‌డబ్ల్యుఎస్ఇ సత్యనారాయణ, డిఇఒ అబ్రహం, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ, మెడికల్ అండ్ హెల్త్ పిఒ ఎన్‌సిడి డాక్టర్ నరేంద్రకృష్ణ, డిసిహెచ్ డిబి.పాల్ సతీష్ కుమార్, పశుసంవర్ధశాఖ జెడి జి.నెహ్రూబాబు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు అర్బన్: పొట్టకూటి కోసం పనులు నిమిత్తం వెళుతున్న ఇద్దరు కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని, ఆ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి శివారు గొల్లగూడేనికి చెందిన కూలీలు కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లి పత్తితీత పనులకు వెళుతుండగా గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకుందన్నారు. చేసుకోవడానికి పనులు లేక, ఉపాధి హామీ పనులు ప్రభుత్వం చూపకపోవడంతో పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు పనులు నిమిత్తం వెళ్లడమే ఈ ప్రమాదానికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు, గాయపడిన 19 మంది కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పనులు చూపకపోవడం వల్లనే పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు కూలీలు వెళ్లాల్సి వస్తోందని, ఈ ప్రమాదాన్ని ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలన్నారు. చనిపోయిన ఇద్దరు కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున, గాయపడిన వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందించాలని, కోల్పోయిన పని దినాలకు, జీవనానికి నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న ఈ తరహా రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పేదలు, దళితులు, వ్యవసాయ కార్మికులు, కూలీలే బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు కత్తిరించి, అనవసర ఆంక్షలు పెట్టి కూలీలకు చట్టాన్ని దూరం చేయడం కూలీల పొట్టకొట్టడమేనని విమర్శించారు. ఒక పక్క యంత్రాలు వచ్చి కూలీ పనుల రోజులు తగ్గిపోతున్నాయని, దీంతో దూరప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు, దళితులకు, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు ఉపాధిని చూపాల్సిన బాధ్యత ఉందని, పనులు కల్పించాలని, రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలని రవి డిమాండ్ చేశారు.

బాలల సంక్షేమ కమిటీ పనితీరు మెరుగుపడాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

నిరాధారణ గురైన బాలల సంరక్షణను చేపట్టవలసిన జిల్లా బాలల సంక్షేమ కమిటీ తమ పనితీరును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం బాలల సంక్షేమంపై జిల్లా బాలల సంక్షేమ కమిటీ తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ కారణాలతో నిరాధారణకు గురైన బాలల వివరాలు, వారి సంక్షేమానికి తీసుకున్న చర్యలపై జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు సరైన సమాచారం అందించకపోవడం, పూర్తి సమాచారంపై సమావేశానికి హాజరు కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, నిరాధారణకు గురైన బాలలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాలు, పోక్సో చట్టంలో బాధితులకు, తదితర బాలలకు జువైనల్ యాక్ట్ ప్రకారం సంక్షేమం చూసి, వారికి న్యాయ సహాయం, న్యాయం జరిగే వరకు రక్షణ అందించాల్సిన బాధ్యత జిల్లా బాలల సంక్షేమ కమిటీకి ఉందని, ఇందుకు సంబంధించి జిల్లాలో పలు కేసులు నమోదైనప్పటికీ వాటికి సంబంధించిన సమాచారాన్ని సమీక్షలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు సక్రమంగా తెలపకపోవడంతో, సరైన అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ, తదుపరి సమావేశానికి పూర్తి వివరాలతో హాజరు కావాలని, లేని పక్షంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ రద్దుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని హెచ్చరించారు. బాలల సంక్షేమానికి సంబంధించి మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాంఘికశాస్త్రం పరీక్షకు 23,024 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు మినహా ప్రశాంతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా బుధవారం పూర్తయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమై, బుధవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పదవ తరగతి పరీక్షలు నిర్వహించారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించారు. సాంఘిక శాస్త్రం పరీక్షకు 23,813 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 23,024 మంది మాత్రమే హాజరయ్యారు. 789 మంది విద్యార్థులు ఈ పరీక్షకు గైర్హాజరయ్యారు. వీరి హాజరు శాతం 96.69గా నమోదైంది. ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయిన విద్యార్థుల విషయానికి వస్తే ప్రయివేట్ విద్యార్థులు మొత్తం 2,874 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా వారిలో 1,232 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 1,642 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విద్యార్థి దశలో 'పది' కీలకం

ట్రెయినీ డిఎస్‌పి విద్య

భీమడోలు: విద్యార్థి దశలో పదవ తరగతి పరీక్షలు కీలకమని, భవిష్యత్ ఉజ్వలంగా ఉండటం కోసం వారు తగు ప్రణాళికలు రూపొందించుకోవాలని శిక్షణా డిఎస్‌పి బి.విద్య, భీమడోలు సిఐ బిబి.రవికుమార్ కోరారు. పదవ తరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో భీమడోలు హైస్కూల్ కేంద్రంగా బుధవారం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివిధ అంశాలపై వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత విద్యార్థుల ప్రవర్తన, వారి తీరు తెన్నులను తరచూ పరిశీలించాలని కోరారు. ఇదేవిధంగా ట్రాఫిక్ నిబంధన పట్ల తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని కోరారు. వారు అసాంఘిక కార్యక్రమాల వైపు దృష్టిని మరల్చకుండా జాగ్రత్త వహించాలని కోరారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రాజకీయాల్లో విద్యార్థుల జోక్యం లేకుండా చూసుకోవాలని కోరారు. ఇదే క్రమంలో ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా 70 శాతం వరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ఆ తర్వాత లైసెన్స్ లేకుండా వాహనాల నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా విస్తరిస్తుందని, దానిని అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి తెలిపారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కమిటీ సమావేశం స్థానిక అన్నేభవనంలో బుధవారం పి.హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శ్యామలరాణి మాట్లాడుతూ మొన్న విశాఖలో జరిగిన తనిఖీలో డ్రగ్ మాఫియా బయటపడిందని, దీనివల్ల యువత భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందన్నారు. విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని, పక్కదారి పట్టి భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధాన్ని దఫాదఫాలుగా రద్దుచేయాలని, అందుకు అన్ని రాజకీయపార్టీలు తమ మేనిఫెస్టోల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పలుచోట్ల మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని దాన్ని పరిష్కరించాలని జిల్లా అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎం.వరలక్ష్మి, ఉషారాణి పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న శ్యామలారాణి

హోంగార్డుల సంక్షేమానికి కృషి

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ఏలూరు స్పోర్ట్స్: హోంగార్డుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి స్పష్టం చేశారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో హోంగార్డు విధులకు ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కోటేశ్వరరావుకు యూనిట్ తరపునుంచి రావాల్సిన రూ.5,50,960 చెక్కును బుధవారం ఆమె కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. హోంగార్డు మృతి చెందిన పక్షంలో వారికి రావలసిన అన్ని సదుపాయాలను వారి కుటుంబ సభ్యులకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్.పవన్ కుమార్ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 13 మంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి చికిత్స నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, అభిమాన సంఘాలు, విద్యాసంస్థలు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి, తలసేమియా చిన్నారులను ఆదుకోవాల్సిందిగా కోరారు. బుధవారం తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, రిటైర్డ్ ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ కోనేరు దుర్గ మల్లేశ్వరరావు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెవి.సీతారాం, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె వర ప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, డాక్టర్ పిఎఆర్‌ఎస్ శ్రీనివాస్, కోనేరు దుర్గ మల్లేశ్వరరావు, కెవి రమణ పాల్గొన్నారు.

'బెల్ట్ షాప్ వద్ద వైసిపి జెండా'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని లక్ష్మిపురం గ్రామ పరిధిలో సాక్షాత్ బ్రాండీ షాప్ పక్కన ఉన్న బెల్ట్ షాప్ దగ్గర వైసిపి జెండా నేటికీ దర్జాగా రెపరెపలాడుతుంది. కిల్లి బెల్ట్ షాపు వైపు ప్రభుత్వ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మండల అధికారుల పర్యవేక్షణ గ్రామాల్లో లేకపోవడంతోనే ఇలాంటివి నిర్లక్ష్యంగా దర్శనమిస్తున్నాయని, ఇకనైనా అధికారులు మండల కేంద్రాల్లో ఉన్నటువంటి గ్రామాలపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఎలక్షన్ కోడ్‌ను కచ్చితంగా అమలు పరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.


బెల్ట్ షాపు వద్ద వైసిపి జెండా

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - దెందులూరు

టిడిపి పుట్టిందే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసమని, ఇది బిసి, ఎస్‌సి, మైనార్టీ, వెనుకబడిన వర్గాల పార్టీ అని దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం గ్రామంలో దెందులూరు నియోజకవర్గానికి చెందిన వైసిపి సీనియర్ నేతలు, కార్యకర్తలు 200 మంది సంపంగి వేణుగోపాల్ తిలక్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ వారికి టిడిపి కండువా వేసి టిడిపిలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సంపంగి వేణుగోపాల తిలక్, కొలుసు వాని, దాసే శ్రీను మాట్లాడుతూ టిడిపి సిద్ధాంతాలు, మేనిఫెస్టో నచ్చి వైసిపి చేస్తున్న దళితుల మీద దాడులు, అరాచకాలకు విరక్తి చెందడంతో టిడిపిలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత, మాజీ జోగన్నపాలెం సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధు, జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ బాబు, తాత సత్యనారాయణ, నున్న లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు గ్యారెంటీ అనే విశ్వాసంతో ప్రతి ఒక్కరూ టిడిపిలో చేరుతున్నారని నూజివీడు టిడిపి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం నూజివీడు మండలం సిద్ధార్థ నగర్, వెంకటాయపాలెం గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు మొవ్వర్తి రాజు, వెంకటాయపాలెం గ్రామ మాజీ సర్పంచి బాణావతు భద్రం, సిద్ధార్థ నగర్ మాజీ ఎంపిటిసి బుకియా అయ్యాన్ తదితరులు పలువురు సారథి సమక్షంలో టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరంపేటలో జెండాదిమ్మకు రంగుమార్పు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పేరంపేట గ్రామ పంచాయతీలో రాజకీయపార్టీ జెండా దిమ్మ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పార్టీరంగు కలిగియున్నట్లు చేసిన ఫిర్యాదుపై పేరంపేట గ్రామ రంగు మార్పించినట్లు చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.అద్దయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వారు సదరు జెండాదిమ్మను దాని ఎదురుగా ఉన్న విగ్రహానికి వేరే రంగు వేయించడం జరిగిందని తెలిపారు.

చింతమనేని కాన్వాయ్ తనిఖీ

ప్రజాశక్తి - దెందులూరు

పెదపాడు మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న కలపర్రు టోల్ గేట్ వద్ద దెందులూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ కాన్వాయ్‌ని బుధవారం ఉదయం పోలీసులు తనిఖీ చేశారు. అప్పన్నవీడు, హనుమాన్ జంక్షన్లలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని దెందులూరు వస్తున్న చింతమనేని కాన్వాయ్‌ని టోల్ ప్లాజా వద్ద ఆపిన పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా చింతమనేని వారి విధులకు పూర్తిగా సహకరించారు. కాన్వాయ్ లో ఎటువంటి అభ్యంతరకర సామగ్రి లేదని ధృవీకరించిన అనంతరం పోలీసులు చింతమనేని కాన్వాయ్‌ని ముందుకు అనుమతించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి : ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేద్దామని, చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నా సరి చేసుకుని, ముందుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్‌తో రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావూరి లావణ్య, సుందరావు, బొడ్డు వాసు పాల్గొన్నారు.

భవిత పాఠశాలలో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు

భీమడోలు: సినీ నటులు రామ్‌చరణ్ జన్మదిన కార్యక్రమాలను భీమడోలులో ఆయన అభిమానులు బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అభిమానులు ముందుగా కేకును కోసి మిఠాయిలను పంచారు. ఆ తరువాత వికలాంగ విద్యార్థులకు ప్రత్యేకించిన భవిత పాఠశాలలో విద్యార్థులకు భోజన సదుపాయాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుల అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సరిహద్దు వివాదంలో దాడి : ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని దేవరగుంట గ్రామంలో సరిహద్దు వివాదంలో బుధవారం ఇరువురు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో బెజవాడ లక్ష్మి సునీత(42), కొనకాల రంగమ్మ(51)లకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాధితులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు సమాచారం సేకరించి, ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.50 వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలలో భాగంగా భీమడోలుకు చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.50 వేల నగదు స్వాధీన పరుచుకున్నట్లు మండల ఎస్ఎస్ టీమ్ అధికారి ఎమ్‌డీ మొహిద్దీన్ తెలిపారు. స్వాధీన పరుచుకున్న నగదును తహశీల్దార్ జెవిఆర్ రమేష్ సారథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సత్యవేణికి అందజేశారు. ఈ నగదును ఏలూరు ఎన్నికల విభాగపు ట్రెజరీ అధికారి వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. తగిన ఆధారాలు చూపించినట్లయితే నగదు గల వ్యక్తికి ట్రెజరీ నుంచి సొమ్ము వెనక్కి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సిఐఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం మండలంలోని తాటియాకులగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిఆర్ఆర్ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట పని మీద వెళ్లి తిరిగి జీలుగుమిల్లికి వస్తూ తాటియాకులగూడెం సమీపంలో వున్న గోతిని తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని ట్రక్ ఆటో ఎక్కించి చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


పోలవరం : పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సాంఘిక శాస్త్రం పరీక్షకు 1120 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి జె.సురేష్‌బాబు తెలిపారు. 945 మంది గైర్హాజరైయ్యారన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటలో తమ తోడ్పాటు అందించిన తహశీల్దార్, ఎంపిడిఒ, పోలీస్ వారికి మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం టౌన్: సోషల్ పరీక్షతో పదో తరగతి పరీక్షలు ముగిశాయి. మొత్తం విద్యార్థులను కలిపి 2059 మంది హాజరు కావాల్సి ఉండగా, 1915 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 144 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని ఎంఇఒ తెలిపారు. పరీక్షలు ముగియడంతో అటు విద్యార్థులు ఇటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జీలుగుమిల్లి: మండల వ్యాప్తంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బర్రింకలపాడులోని గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా రెండు కేంద్రాల గుండా మొత్తం 466 మంది విద్యార్థులకు గాను 404 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 62 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ ఎస్.బుచ్చయ్య తెలిపారు. పరీక్షల్లో ఎక్కడా ఎటువంటి అవాంచనీయ ఘటనలూ జరగకుండా ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

పోలవరం : మండలంలో పది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. గూటాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 131 మందికి 109 మంది విద్యార్థులు, కచేరి వద్ద సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 79 మందికి 41 మంది, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మందికి 256 మంది విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, మూర్తి తెలిపారు.

కలిదిండి : మండలంలో పదవ తరగతి పరీక్షలు సాంఘిక శాస్త్రంతో ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. ఆరు పరీక్షా కేంద్రాలైన ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 196 మందికి 171 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 328 మందికి 324 హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. శశి హై స్కూల్‌లో 61కి 45 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 267 మందికి 253 హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. క్రాంతి హైస్కూల్‌లో 52 మందికి 32 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. భాస్కరరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 149కి 144 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. మండలంలో మొత్తం 1053 మందికి 969 మంది పరీక్షకు హాజరు కాగా 84 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ తెలిపారు.

టి.నరసాపురం : పది పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసాయని మండల విద్యా శాఖాధికారి టి.రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించిన నాలుగు పరీక్ష కేంద్రాల సిఎస్‌లు, డిఒలు, ఇన్విజిలేటర్లు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, ఆరోగ్య సిబ్బందికి విద్యాశాఖ తరుపున ధన్యవాదాలు తెలిపారు. కాగా ఆఖరి పరీక్షకు మండలంలో మొత్తం 589 మంది విద్యార్థులకు 538 మంది హాజరయ్యారని, 51 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

'అక్రమ మద్యం, నాటుసారా అరికట్టాలి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

అక్రమ మద్యం, నాటుసారా ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అరికట్టాలని జిల్లా ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు తెలిపారు. నూజివీడు పట్టణంలోని శ్రీసారథి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది, ఇంజనీరింగ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

'భీమడోలు'లో ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసు బాబు బుధవారం సాయంత్రం భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని లింగం పాడు, ఇతర ఆవాస ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన, చేయనున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని, దీనిలో భాగంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా, సర్పంచి పి.సునీత మాన్సింగ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, ఎంపిటిసి సభ్యులు ముళ్ళగిరి జాన్సన్ పాల్గొన్నారు.

బిఎస్‌పి ఎంపీ అభ్యర్థిగా పాల్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బహుజన్ సమాజ్ పార్టీ ఏలూరు పార్లమెంటరీ అభ్యర్థిగా ప్రొఫెసర్ ఎన్ఎడి పాల్ పేరును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి ప్రకటించారు. బుధవారం ఏలూరులోని బిఎస్‌పి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరా భరత్ అధ్యక్షతన జరిగిన బహుజన సమాజ్ పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న పరంజ్యోతి మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటరీ అభ్యర్థిగా ఆచార్య ఎన్ఎడి పాల్ పోటీ చేస్తారని, ఆయన ఉన్నత విద్యావంతుడని, ఆయన గెలుపు కోసం దళిత బహుజనలందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జిల్లా నుంచి పోటీ చేయబోయే బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అందుగల రతన్ కాంత్, చింతలపూడి నుంచి న్యాయవాది ఎల్‌వి చైతన్య, దెందులూరు అసెంబ్లీ నుంచి నేతల రమేష్ బాబు, ఉంగుటూరు నుంచి బుంగా యేసు, కైకలూరు నుంచి మన్నేపల్లి నాగేశ్వరరావు, నూజివీడు నుంచి డాక్టర్ చెలిగంటి వెంకటేశ్వరరావు, పోలవరం నుంచి సరియం వెంకటేశ్వరరావులు పోటీ చేస్తారని తెలిపారు.

తనిఖీల్లో రూ.3.86 లక్షలు స్వాధీనం

ఉంగుటూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజవలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జరిపిన తనిఖీల్లో రూ.3,86,400 నగదు సీజ్ చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలవుతున్న క్రమంలో నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ద్వారా ఉంగుటూరు గ్రామం వద్ద రూ.81,200, రూ.69,500 సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా నిడమర్రులో రూ.1.75 లక్షలు, గణపవరంలో రూ.60,700 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం జరిపిన తనిఖీల్లో నగదు గుర్తించి స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించడమైనదని తెలిపారు.

అధ్వానంగా పేరంపేట రోడ్డు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలో పేరంపేట వెళ్లే రోడ్డు మార్గం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. పేరుకే అభివృద్ధి అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం కనీసం రోడ్డు మార్గాలను సరిచేయలేని పరిస్థితుల్లో ఉంది అనడానికి ఇలాంటి రహదారులే ఉదాహరణలుగా ఉన్నాయి. నిత్యం అధికారులు తిరిగే రోడ్డు అధ్వానంగా ఉన్న పట్టించుకున్న నాథుడే లేడు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డు మార్గాలను సరిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


గోతులమయంగా రహదారి

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

సిఐ క్రాంతి కుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సమస్యాత్మక గ్రామాల్లో, ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి.క్రాంతి కుమార్ తెలిపారు. బుధవారం జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలోని కామయ్యపాలెం, జీలుగుమిల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించుటకు సిఆర్‌పిఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.చంద్రశేఖర్, సిఆర్‌పిఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ కార్యదర్శిగా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జనసేన దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మిని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ కార్యదర్శిగా నియమిస్తూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామక పత్రాన్ని అందుకున్న వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపైన పోరాడుతూ, తద్వారా జనసేన బలోపేతానికి తాను చేస్తున్న కృషిని గుర్తించి పవన్ కళ్యాణ్ ఈ పదవిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పుడున్న ఈ రాక్షస పాలన అంతం చేయడమే లక్ష్యంగా అందరం కష్టపడి కలిసి పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

'నవరత్నాల పేర ప్రతిఒక్కరికీ లబ్ధి'

ప్రజాశక్తి - ముసునూరు

నవరత్నాల పేరట అందరికీ అన్ని పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు కొనియాడారు. బుధవారం మండలంలోని రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచార రథయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చెప్పాడంటే చేస్తాడనే పద్ధతిలో బడుగు, బలహీన, వర్గాల వారు నమ్మారని, ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గ భవాని వెంకట్రావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన పాల్గొన్నారు.

రావికంపాడులో రోషన్ పర్యటన

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని రావికంపాడులో సొంగ రోషన్ కుమార్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ టిడిపి సూపర్ సిక్స్ పథకాలను తెలియజేస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్రాన్ని సంక్షేమం పేరుతో మోసం చేయటం వల్ల 20 సవంత్సరాలు అభివృద్ధిలో వెనుకకి వెళిపోయామన్నారు. చదువుకున్న చదువుకి సరైన ఉద్యోగాలు రావాలి అంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని తెలిపారు.

మణికంఠ కుటుంబానికి అండగా ఉంటాం

ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ చౌదరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు నిత్యం పనిచేసే జర్నలిస్టు వృత్తి ఎంతో కష్టతరమైందని, అయినప్పటికీ అంకితభావంతో పనిచేస్తున్న ఆంధ్రప్రభ రిపోర్టర్ శ్రావణం మణికంఠ ఆకస్మిక మరణం తనను కలించివేసిందని దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ చౌదరి తెలిపారు. వృత్తిపట్ల నిబద్ధత, అంకితభావంతో పాటు అందరితో స్నేహభావంతో జీవించిన ఆయన ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోవడం కష్టతరంగా ఉందన్నారు. గుండె నొప్పితో ఆకస్మికంగా మృతి చెందిన మణికంఠ సొంత గ్రామమైన చాటపర్రులోని స్వగృహానికి విచ్చేసి భౌతికకాయంపై పూలమాలవేసి ఎంఎల్‌ఎ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. మణికంఠ కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందజేశారు. వైసిపి నాయకులు జానంపేట బాబు, తేరా ఆనంద్, రఘు ఎపిడబ్ల్యూజె దెందులూరు నియోజకవర్గం అధ్యక్షులు కొత్తపల్లి వంశీ కుమార్, పాత్రికేయులు దారం నానిబాబు, వడ్డాది మధుకుమార్ ఉన్నారు.

ఈడేపల్లిలో స్వాతి ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి మండలంలోని ఈడేపల్లి, సీతారామపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు జగనన్న ఆశీస్సులతో పోటీ చేస్తున్నారన్నారు. తమ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపిపి సత్యనారాయణ పాల్గొన్నారు.